సాక్షి వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



ఎర్రచందనం దుంగల స్వాధీనం

పాలకొండల్లో చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్న 18 ఎర్రచందనం దుంగలను మంగళవారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



జాతీయ క్రీడా పోటీలకు ఎంపిక

కమలాపురం పరిధిలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ భారతి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.9 /27.6

వాతావరణం

జిల్లాలో మంగళవారం 27.0 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.48 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి 'లా' పరీక్షలు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 18వ తేదీ నుంచి 3, 5 సంవత్సరాల ఎల్.ఎల్.బి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. మూడేళ్ల ఎల్.ఎల్.బి 2, 4, 6 సెమిస్టర్లు, ఐదేళ్ల ఎల్.ఎల్.బి 2, 4, 6, 8,10 సెమిస్టర్లు చదివే విద్యార్థులు నిర్ణీత తేదీలలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఈ పరీక్షలు అక్టోబర్ 10వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

వైవీయూ : ఉన్నత విద్యలో నైపుణ్యం-ఆధారిత పాఠ్యాంశాలపై యోగివేమన విశ్వద్యాలయంలో ఈనెల 26 ,27 తేదీలలో నిర్వహించనున్న వర్క్ షాప్ పోస్టర్లను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యశాల కన్వీనర్లు డాక్టర్ కె. లలిత, డాక్టర్ పి. సరిత , డాక్టర్ సునీత పాల్గొన్నారు. వివరాలకు 83092 76615, 81066 04789, 86396 48721 నంబర్లను సంప్రదించాలన్నారు.

పవిత్రాల సమర్పణ



పవిత్రాల అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడప దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడవరోజు మంగళవారం కార్యక్రమాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం పవిత్రాల సమర్పణ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకమైన హోమ గుండం ఏర్పాటు చేసి అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్‌ల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం విశేష అలంకారంలో కొలువుదీర్చిన స్వామి, అమ్మవార్లకు పవిత్రాలను సమర్పించారు. బుధవారం పూజోత్సవాలను నిర్వహించనున్నారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం

బద్వేలు అర్బన్ : జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించడమే పాన్ ఇండియా ప్రచారం - 2024 ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. పాన్ ఇండియా - 2024 ప్రచారంలో భాగంగా మంగళవారం బద్వేలు సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లతో బృందాలను ఏర్పాటు చేసి ప్రచారానికి సంబంధించిన బ్యానర్లను బస్టాండు, రైల్వేస్టేషన్, సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసు, కోర్టు తదితర ప్రాంతాల్లో ప్రదర్శించాలని కోరారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది ఇజాజ్‌బాష, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి ఏపీ ఆన్‌లైన్ సాండ్ పోర్టల్ ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్ : ఈ నెల 19 నుంచి ఏపీ ఆన్‌లైన్ సాండ్ పోర్టల్ అందుబాటులోకి రానుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఈ పోర్టల్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో ప్రారంభిస్తారని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డ్ రూం లో న్యూ సాండ్ పాలసీ, ఏపీ ఆన్‌లైన్ సాండ్ పోర్టల్ మీద శిక్షణా కార్యక్రమం జరిగింది. జేసీ మాట్లాడుతూ ఇసుక బుకింగ్ ప్రక్రియ, రవాణాదారుల జాబితా పొందుపరిచే ప్రక్రియ, బల్క్ వినియోగదారుల ఇసుక అవసరాన్ని ముందుగానే వెరిఫికేషన్‌ను పట్టణ ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో తహసీల్దార్లు ముగించి సంబంధిత గనులు, భూగర్భ శాఖ ద్వారా జేసీ లాగింగ్ కు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు క్షేత్రస్థాయిలో గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 6 వరకు మొబైల్ యాప్ ద్వారా సాండ్ బుకింగ్ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం దారుణం



టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీఓ విధానం దారుణంగా ఉంది. దీనివల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతోంది. పేద విద్యార్థులు కూడా డాక్టర్లు కావాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ సీట్లను ప్రైవేటుపరం చేస్తుండడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్యాయం జరిగే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- ఉద్దె మద్దిలేటి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి, కడప



పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు



మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వ కాలేజీల్లో తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అదే ప్రైవేటుపరం చేస్తే విద్యార్థులపై ఫీజుల భారం పడుతుంది. తద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదముంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను త్వరగా పూర్తి చేసి ఎంబీబీఎస్ సీట్లు తెచ్చేలా చొరవ చూపాలి. పేద విద్యార్థులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచించాలి.

- కేసీ బాదుల్లా, రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కడప

దోపిడీ రాజ్యం

- యథేచ్ఛగా గ్రావెల్ దందా
- కనుమరుగవుతున్న గుట్టలు, కొండలు
- చింతకొమ్మదిన్నె నుంచి పెండ్లిమర్రికి పాకిన దందా
- నిత్యం వందలాది టిప్పర్లతో అక్రమంగా గ్రావెల్ తరలింపు
- పట్టపగలు తరలిస్తున్నా పట్టించుకోని యంత్రాంగం



గ్రావెల్ లోడ్‌తో తరలివెళ్తున్న టిప్పర్



గొందిపల్లెలో పొక్లెయిన్ ద్వారా గ్రావెల్ లోడింగ్

సాక్షి ప్రతినిధి, కడప : ప్రభుత్వ నిర్వాకం వల్ల గ్రావెల్ మాఫియా తెరపైకి వచ్చింది. లీజుదారులకు రాయల్టీ పర్మిట్లు ఇవ్వకపోవడంతో, అదే అదనుగా అధికారపార్టీ నేతలు అక్రమ మైనింగ్ యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. చింతకొమ్మదిన్నె మండలంలో మొదలైన ఈ వ్యవహారం పెండ్లిమర్రి మండలానికి పాకింది. రాయల్టీ రూపేనా లభించాల్సిన కోట్లాది రూపాయలు అక్రమార్కులకు చేరుతోంది. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొండలు, గుట్టలు కనుమరుగు అవుతున్నాయి. వెరశి దోపిడీ రాజ్యం కొనసాగుతోంది.

కడప పరిసర ప్రాంతాల్లో అధికారికంగా ఐదు గ్రావెల్ మైనింగ్ లీజులున్నాయి. లీజుదారులకు పర్మిట్లు ఇవ్వకపోవడంతో అధికారిక మైనింగ్ చేయడం లేదు. పర్మిట్లు ఇస్తే రాయల్టీ చెల్లించి గ్రావెల్ తరలించేవారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం ఒనగూరేది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుతమ్ముళ్లు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. తద్వారా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈమొత్తం వ్యవహారం ప్రత్యక్షంగా పట్టపగలు కొనసాగిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఈక్రమంలో చింతకొమ్మదిన్నె చెరువు నుంచి ప్రారంభమైన అక్రమ మైనింగ్ వ్యవహారం తర్వాత కొలుములపల్లె గ్రామం సమీపంలోని పిచ్చమ్మగుట్టకు చేరింది. అక్కడి నుంచి పబ్బాపురం చెరువుకు చేరింది. తాజాగా ఈదందా పెండ్లిమర్రి మండలం గొందిపల్లె గుట్టలకు చేరడం విశేషం. అక్రమార్కుల నిర్వాకం కారణంగా గుట్టలు, చెరువులు క్రమేపి కనుమరుగు అవుతున్నాయి.

దోలమైట్ లీజులో గ్రావెల్ మైనింగ్...

పెండ్లిమర్రి మండలం గొందిపల్లెలో సర్వే నంబర్ 480/1పి లో 17.8 హెక్టార్లు బెరైటీస్, డోలమైట్ మైనింగ్ లీజును వెల్లటూరుకు చెందిన వి. వెంకటసుబ్బయ్య 2018లో దక్కించుకున్నారు. అందులో వైట్ బెరైటీస్ టన్నుకు రూ.1000, కలర్ బెరైటీస్ టన్నుకు రూ.200, డోలమైట్ టన్నుకు రూ.80 రాయల్టీ ఫీజు చెల్లించేలా ఉత్తర్వులున్నాయి. కాగా డోలమైట్ లేదా బెరైటీస్ మైనింగ్ చేయకుండా కేవలం ఆ ప్రాంతంలో ఎలాంటి రాయల్టీ ఫీజు చెల్లించకుండా గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం వందలాది టిప్పర్లతో గ్రావెల్ తరలిస్తున్నట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. టిప్పర్ బాడుగ, మిషన్ లోడింగ్ రూ.2 వేలు ఖర్చు మినహాయిస్తే, ఒక్కో టిప్పర్‌కు రూ.3 వేలు ఆదాయాన్ని తెలుగుతమ్ముళ్లు ఆర్జిస్తున్నారు. ప్రతి రోజు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు గ్రావెల్ ద్వారా ఆదాయం గడిస్తున్నారు.

కమలాపురం నియోజకవర్గ పరిధిలో...

జిల్లా కేంద్రమైన కడప చుట్టూ కమలాపురం నియోజకవర్గం విస్తరించి ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న కొండలు, గుట్టలు ఆసరాగా దాదాపు రెండునెలలుగా అక్రమ మైనింగ్ కొనసాగిస్తున్నారు. చింతకొమ్మదిన్నె, పబ్బాపురం చెరువులతో పాటు పిచ్చమ్మగుట్టలో గ్రావెల్ ఊడ్చిపడేశారు. ఇప్పుడు అక్రమార్కుల దృష్టి గొందిపల్లె గుట్టలపై పడింది. కడప నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన ఓ నాయకుడు కనుసన్నల్లో ఈమొత్తం వ్యవహారం నడుస్తోంది. కమలాపురం ప్రజాప్రతినిధితో ఉన్న సాన్నిహిత్యం, ఆర్థిక లావాదేవిల కారణంగానే ఆ నాయకుడి అక్రమ మైనింగ్ ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. అధికారపార్టీ నేత అండ ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఓవైపు కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉమ్మడిగా అక్రమ మైనింగ్‌ను కట్టడి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తున్నా కిందిస్థాయి యంత్రాంగానికి పట్టడం లేదు. అధికారపార్టీ నేతల ప్రమేయం ఉంటే అక్రమ మైనింగ్ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని పలువురు వివరిస్తున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీడీ రామచంద్రయ్యను వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించగా అందుబాటులోకి రావడం లేదు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తొలుత జిల్లా ఎస్పీ ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ వివరించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం

ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలు వింటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా నిలుస్తాం.. ఎవరూ అధైర్యపడవద్దు అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భరోసా కల్పించారు. మంగళవారం ఉదయం స్థానిక మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కార్యాలయంలో ఆయనతో కలసి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి తమ సమస్యలను వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. మన కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయికి తీసుకు వెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉంటే చెప్పిన హామీలన్నీ అమలయ్యేవన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ప్రజలనుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరెడ్డి, హృషికేశవ రెడ్డి, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌస్‌లాజం, ముల్లాజానీ, రామాంజనేయుల యాదవ్, పోరెడ్డి మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతికతకు మూల పురుషుడు విశ్వకర్మ

కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : సాంకేతికతకు మూల పురుషుడు శ్రీ విరాట్ విశ్వకర్మ అని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా ప్రవచనకారులు దేవశిల్పి విశ్వకర్మను ప్రస్తావించడం సమంజసమైనదేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విశ్వకర్మ జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబరు 17న నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. విశ్వ బ్రాహ్మణ అని పిలిచే విశ్వకర్మ సంఘం దేశంలో గొప్ప సామాజిక సమూహంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహా, బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతిలతో పాటు బ్రహ్మంగారిమఠం ప్రధా నాచార్యులు గోవిందస్వామి, విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు రమణాచారి, నారాయణ పాల్గొన్నారు.


పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం భువనేశ్వర్ నుంచి పీఎంఏవై గ్రామీణ్, అర్బన్‌కు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 విధివిధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ ఎస్‌పీసీ హాలు నుండి కలెక్టర్, అధికారులు హాజరయ్యారు. ప్రధాని ప్రత్యక్ష ప్రసారం ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గృహాలు మంజూరైన వారు త్వరగా ఇండ్లను పూర్తి చేసుకునేలా గృహ నిర్మాణ శాఖ కృషి చేయాలన్నారు. అనంతరం గృహ లబ్ధిదారులకు మెగా తాళం చెవిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడా వీసీ నందన్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ సురేష్ రెడ్డి, డ్వామా పీడీ జోయల్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ శివశంకర్ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జేసీ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గండికోటలో ఇక కొత్త అధ్యాయం



- కోటలో 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం
- పర్యాటక వసతులకు శ్రీకారం
- స్వయం ఆర్థిక ఆదాయానికి ప్రణాళికలు

కడప కల్చరల్ : గండికోట దశ మారనుంది. గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా పేరున్న ఈ సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతంలో అవసరమైన వసతుల కల్పనకు ఈనెల 27న శ్రీకారం చుట్టనున్నారు. 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఎప్పటిలా కడప నగరంలో కాకుండా గండికోటలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఆగస్టు 29న మాతృభాషా దినోత్సవాన్ని కలెక్టర్ శివశంకర్ లోతేటి కడప నగరంలో కాకుండా తొలి తెలుగు శాసనం లభించిన కలమల గ్రామంలో నిర్వహించారు. తొలి తెలుగు శాసనంతోపాటు మరో మూడు శాసనాలను ప్రత్యేకంగా పీఠంపై ప్రతిష్ఠించి సభకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును పిలిపించి ఘనంగా ఉత్సవం నిర్వహించారు. ఇక పర్యాటక దినోత్సవాన్ని గండికోటలో నిర్వహించేందుకు సిద్ధం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆర్థికాభివృద్ధికి చర్యలు

స్వదేశీ దర్శన్-2లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ. 72 కోట్లు ప్రకటించింది. ఈ పథకం కింద గండికోటతోపాటు విశాఖవద్దగల లంబసింగిని మాత్రమే ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ పథకాలు అమలు రూపంలోకి వచ్చేంతవరకు గండికోటను మనవంతుగా అభివృద్ధి చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా పర్యాటక అభివృద్ధి కమిటీ, గండికోట పెద్దలు, ప్రజలు సంబంధిత జిల్లా అధికారులతో ఇటీవల కలెక్టర్ చర్చలు జరిపి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని గండికోటలో నిర్వహించనున్నారు.

కోటలో ఇంకా..

వాచ్‌టవర్, ఆలయాలు, మసీదు, ఇతర పురావస్తు నిర్మాణాల వద్ద వాటి గురించిన వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనువైనచోట పిల్లలకు అవసరమయ్యే వస్తువులతో ఆడుకునేందుకు పార్కు రూపొందించాలన్నారు. ఆనందం, ఆహ్లాదం కోసం గుర్రపు స్వారీ సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రాక్‌ను అభివృద్ధి చేస్తున్నారు. పర్యాటకుల రాకపోకలు పెరిగేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. పర్యాటకులకు ఏర్పాటు చేసే టెంట్‌లను కూడా ముందే రిజిస్టర్ చేయించి అద్దె ప్రాతిపదికన అనుమతించనున్నారు.

అధికారులు తాత్కాలికంగా నిర్ణయించిన టిక్కెట్ ధరలు

టిక్కెట్లు	ధరలు రూ. లలో	సెలవు రోజుల్లో రూ. లలో
ప్రవేశ టిక్కెట్	20	30
బైక్‌పార్కింగ్‌కు	20	20
ఫోర్ వీలర్	50	50
ఆటో	30	30
మినీ బస్సు	100	100
బస్సు	150	150
ప్రీ వెడ్డింగ్ (ఫోటో, వీడియో)	1000	1000

ప్రతీది లెక్కలోకి...

ఇంతవరకు గండికోటలోకి వెళ్లే వారి సంఖ్య గురించి నమోదు చేయడం లేదు. 27 నుంచి ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. కీలకమైన ప్రదేశంలో ప్రధాన ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేయనున్నారు. అక్కడ టిక్కెట్ కౌంటర్, ఆ పక్కనే పోలీసు పికెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ వసతి కల్పిస్తున్నారు. మంచినీరు, శీతల పానీయాలు, తినుబండారాలు తదితరాలు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి అందుబాటులోకి తేనున్నారు. ఈనెల 27న వీటన్నింటినీ ప్రారంభించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వీటికోసం స్థల పరిశీలన, వసతుల కల్పన, ఏర్పాట్లపై అధికారులతో కలిసి కోటలో పర్యటించి నిర్ణయాలు తీసుకున్నారు. లోయ లేదా ఇతర ప్రాంతాల్లో ఫొటో షూట్‌లకు అవసరమైన ఏర్పాట్లు, దుస్తులు మార్చుకునే గది కూడా చేయనున్నారు. ఈనెల 27 నుంచి గండికోటలోకి ప్రవేశించే ప్రతి పర్యాటకుని పేరు, ఇతర వివరాలు నమోదు చేయనున్నారు. ఈ రాబడితో గండికోటను క్రమంగా అభివృద్ధి చేయడంతోపాటు 25 శాతం గ్రామ పంచాయతీకి ఇచ్చేందుకు నిర్ణయించారు.

గండికోటలో టెంట్లకు అనుమతులు

గండికోటలో పర్యాటకులకు పెన్నా లోయ సమీపంలో టెంట్లను అనుమతిస్తున్నారు. దీనికి ఇంతవరకు లెక్క జమా లేవు. కలెక్టర్ ఈ విషయంగా ఇటీవల ఆ గ్రామ సర్పంచ్, పోలీసు అధికారులతో మాట్లాడారు. ఇకపై టెంట్లు వేసుకోదలచిన వారు త్వరలో ఏర్పాటు చేస్తున్న గండికోట అభివృద్ధి కమిటీలో రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కొక్క టెంటుకు నెలకు కమిటీకి రూ. 2000 చెల్లించాలి. అయితే పర్యాటకులకు మాత్రం రోజుకు టెంటు అద్దె రూ.1000 వసూలు చేయవచ్చని నిర్ణయించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


మృతి చెందిన సోమిరెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామానికి చెందిన రైతు సోమిరెడ్డి (58) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమిరెడ్డి వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. గ్రామంలోని తన తోట వద్దకు రోజు మాదిరిగానే మంగళవారం వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేసి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలి చనిపోయాడు. సోమిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన ఖాదర్‌బాషా

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జెండా మాను వీధిలో నివాసముంటున్న సయ్యద్ ఖాసీం పీరా కుమారుడు సయ్యద్ ఖాదర్ బాషా (43) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాదర్ బాషా కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఇంటిలోనే ఉండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

జాతీయ క్రీడా పోటీలకు ఎంపిక


కమలాపురం : విజేతలతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు


ఎర్రగుంట్ల : విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

డీఏవీ భారతి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కమలాపురం : మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని డీఏవీ పాఠశాల భారతి విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ పట్టణంలోని డీఏవీ సెంటినరీ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న డీఏవీ భారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారని పేర్కొన్నారు. కబడ్డీలో అండర్-14 విభాగంలో బాల, బాలికల జట్లు వేర్వేరుగా ద్వితీయ స్థానంలో నిలిచాయన్నారు. చదరంగంలో అండర్-14 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం పొందారని పేర్కొన్నారు. కబడ్డీ అండర్-14 బాలుర విభాగంలో శారున్ కుమార్, జశ్వంత్, ఆదిల్, యశ్వంత్‌రెడ్డి, ఇలియాజ్, యతీష్‌రెడ్డి, గంగా ప్రణీత్ జట్టు ప్రతిభ కనబరిచిందన్నారు. అండర్-14 బాలికల కబడ్డీలో మమత, సాయి హర్షిత, భవిష్య, నిహారిక, తనుశ్రీ, గీతిక జట్టు ప్రతిభ సత్తా చాటిందన్నారు. చదరంగం అండర్-14 బాలుర విభాగంలో లోహితేశ్వర్, రామ్‌చరణ్ ప్రతిభ కనబరిచారన్నారు. వీరంతా త్వరలో జరిగే డీఏవీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని పరిశ్రమ సీఎంఓ సాయి రమేష్, హెచ్‌ఆర్ చీఫ్ గోపాల్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ భార్గవరెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి విద్యార్థులకు సూచించారు. విజేతలతోపాటు పీడీ చందును వారు అభినందించారు.

జువారి డీఏవీ స్కూల్ సత్తా

ఎర్రగుంట్ల : విశాఖపట్టణంలో ఈ నెల 13,14 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జువారి డీఏవీ స్కూల్ చెందిన 24 మంది విద్యార్థులు సత్తా చాటి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనారని ప్రధానోపాధ్యాయులు ఎంవీజీఎస్ నాయుడు తెలిపారు. త్వరలో హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా నగరంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కబడ్డీలో 9, స్కేటింగ్‌లో 5, క్రికెట్‌లో 10 మంది పాల్గొంటారన్నారు. మొత్తం 28 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనగా అందులో 24 మంది జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నారని చెప్పారు. జువారి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ క్రిష్ణమూర్తి, సీనియర్ జీఎం ఫణి కుమార్‌లు వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రటబులేసును అభినందించారు.

మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ చేసిన విమర్శలు అర్థరహితం. కేవలం కూటమి ప్రభుత్వం తరపున మాట్లాడటం కాదు. పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తుపెట్టుకోవాలి. ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలి కానీ.. అనవసర వ్యాఖ్యలు సరికాదు. ఎంతసేపూ వైఎస్ఆర్‌సీపీపై పడి ఏడిస్తే ఏం లాభం. కాలయాపన మాటలను ప్రజలు నమ్మరు.

–ఇలియాస్, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ కన్వీనరు, కడప



జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసు



వైఎస్ జగన్‌కు ప్రజల్లో మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రద్దు చేస్తున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక రాష్ట్రానికి తొలిసారిగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు రావడం గొప్ప విషయం. వైద్య కళాశాలలు లేక వేరే ప్రాంతాలకు మన పిల్లలు వెళ్తున్నారు. ఫిలిప్పీన్స్ వెళ్లిన ముగ్గురు విద్యార్థులు చనిపోయిన విషయం అందరికీ తెలిసిందే. తక్కువ ఖర్చుతో చదవ వచ్చని అక్కడికి వెళ్తున్నారు. ఇక్కడే తక్కువ ఖర్చుతో చదివే అవకాశం లభిస్తే.. అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేదు కదా?

– సుధామాధురి, ఎంపీపీ, చిన్నమండెం

ఎర్రచందనం దుంగల స్వాధీనం


అదుపులోకి తీసుకున్న నిందితులు, దుంగలతో అటవీ శాఖ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అక్రమంగా తరలిస్తున్న 18 ఎర్రచందనం దుంగలను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పాలకొండలు రిజర్వు ఫారెస్టులోని ఎర్రచందనం చెట్లను నరికి 18 దుంగలుగా మార్చి అక్రమంగా రవాణా చేస్తుండగా అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కడప అటవీ శాఖ రేంజ్ మద్దిమడుగు సెక్షన్ ఈస్ట్ బీట్‌లోని టేకుచెట్ల ప్రాంతంలో పట్టుకున్నారు. వాహనం, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప అటవీశాఖ అధికారి పీవీ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్, మద్దిమడుగు సిబ్బంది షకీల్ అహ్మద్, ఎస్.బాషా, ఎల్.ముఖర్జీ, చౌడయ్య, నందిని లు దాడి చేశారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన ధనరాజ్, గోపినాథ్ గుణశేఖరన్, ధర్మపురికి చెందిన జాడియన్ వెంకటేశన్, కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన షేక్ షామీర్‌బాసా, మద్దిమడుగు సుగాలిబిడికి చెందిన బాబు నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని తిరుపతి కోర్టులో హాజరు పరిచారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత


బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న డీఎస్పీ రమాకాంత్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆటోలో వెళుతూ నగదు, బంగారు నగలు ఉన్న బ్యాగును పోగొట్టుకున్న మహిళకు తిరిగి అప్పగించారు. నకాష్‌కు చెందిన రిజ్వాన దేవునికడప రోడ్డులో ఆటో ఎక్కి ఓల్డ్ రిమ్స్ దగ్గర దిగింది. అదే సమయంలో మరో మహిళ కూడా ఆటోలో ఎక్కింది. రిజ్వాన తన బ్యాగ్‌ను ఆటోలోనే పడేసుకుని వెళ్లిపోయింది. ఆటోలో ఉన్న మరో మహిళ కొంత దూరం వెళ్లాక పరిశీలించగా బ్యాగు కనిపించింది. దీంతో బ్యాగ్‌ను కడప ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల్లో పరిశీలించారు. ఆటోను గుర్తించి విచారణ చేశారు. బ్యాగ్‌ను పోలీస్‌స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. డ్రైవర్, మహిళను కడప ఇన్‌చార్జి డీఎస్పీ రమాకాంత్, టూ టౌన్ సీఐ నాగార్జున మంగళవారం సత్కరించి బాధితురాలికి బ్యాగ్ అప్పగించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన తెల్లాకుల మనోహర్‌పై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయింది. అమృతానగర్‌కు చెందిన రామిగాళ్ల మద్దిలేటమ్మ, సుధాకర్, రాజేశ్వరితోపాటు మరి కొందరు.. మనోహర్ వద్దకు వెళ్లి గుడి విషయంలో ఎందుకు తమను ఇబ్బంది పెడుతున్నావని అడిగారు. ఈ క్రమంలో మద్దిలేటమ్మపై మనోహర్ దాడి చేసి కులంపేరుతో దూషించాడని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పరిశుభ్రత.. అందరి బాధ్యత


ఉద్యోగులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ ఆవరణలో ఉద్యోగులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 1 వరకు స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతను అనుసరించి స్వచ్ఛత కొరతకు కట్టుబడి ఉండాలన్నారు. అందుకోసం ఈ సమయాన్ని అంకితబద్ధం చేయాలని, ఏడాదికి 100 గంటలు, వారానికి రెండు గంటలు చొప్పున పరిశుభ్రత కోసం స్వచ్ఛందంగా పాటుపడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం ఆధ్వర్యంలో ఏపీఎస్ ఆర్టీసీలోని ఆరు డిపోలు, బస్టాండ్లలో స్వచ్ఛతా సేవా పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓ ధనలక్ష్మి, డిప్యూటీ సీటీఎం పీఎల్ భాస్కర్, డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి, కార్గో జోన్ మేనేజర్ హరి, జిల్లా మేనేజర్ జనార్దన్, అధికారులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్టకు దారేది?



కంప చెట్లతో నిండిపోయిన ఆనకట్ట రహదారి

పెద్దముడియం : రాజోలి ఆనకట్టకు వెళ్లే రహదారి కంప చెట్లతో పూర్తిగా నిండిపోయింది. దీంతో ఆనకట్టను చూడాలనుకునే పర్యాటకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో నాలుగు చక్రాల వాహనాలు వెళ్లే రహదారి ఇప్పుడు ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించి, రహదారిని బాగు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

అక్రమ గ్రావెల్ వాహనాల పట్టివేత

ఎర్రగుంట్ల : ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రగుంట్ల మీదుగా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. వీరపునాయునిపల్లి మండలంలోని ఈర్లపల్లి వద్ద నుంచి గ్రావెల్‌ను మంగళవారం అక్రమంగా ఎర్రగుంట్ల మీదుగా తరలిస్తుండగా పోలీసులు దాడులు చేశారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో పట్టుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రిమ్స్‌లో గుర్తుతెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అనారోగ్యంతో చేరిన గుర్తు తెలియని వ్యక్తి (42) మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎవరైనా అతని బంధువులు, స్నేహితులు వుంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ వైద్యులు తెలియజేశారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం

కమలాపురం : కమలాపురం పట్టణానికి చెందిన సాయి అనే యువకుని నుంచి 50 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. సోమవారం రాత్రి రైల్వే గేటు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. సాయి అనే యువకుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తమ తనిఖీల్లో బయటపడిందన్నారు. అతడిని పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. అలాగే అతడి నుంచి 50 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిపై మండల పరిధిలోని గణేష్‌పురం సమీపంలో మంగళవారం మూడు అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సంజీవ రాయుడు తెలిపారు. పాపాఘ్ని నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను లోడు చేసుకుని కడప పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను వాహన తనిఖీల్లో గుర్తించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ముమ్మరంగా పోలీసుల దాడులు

కడప అర్బన్ : జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల్లో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వాహకులపై దాడులు, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యంపై దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత వారం రోజుల్లో జిల్లా పోలీస్ శాఖ పనితీరుపై గణాంకాలను మంగళవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై 407 మందిపై కేసు నమోదు చేశారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 646 మందిపై ఎం.వి యాక్ట్ కేసులు నమోదు చేసి, వారికి రూ.87,210 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 4.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 8 కేసులు నమోదు చేసి, ఐదుగురిని అరెస్ట్ చేశారు. 10 కేసుల్లో 74 మంది జూదరులను అరెస్టు చేసి రూ.4,84,630 స్వాధీనం చేసుకున్నారు. 7 కేసుల్లో 17 మంది మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి రూ.51,520 స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న 23 మందిని అరెస్టు చేసి 13 కేసులు నమోదు చేశారు. 65 టన్నుల ఇసుకను, ఇసుకను తరలిస్తున్న 17 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 34.56 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని, 7 కేసుల్లో ఏడుగురిని అరెస్టు చేశారు. 6 కేసుల్లో 35 మందిని బైండ్ ఓవర్ చేశారు. 23 మంది రౌడీ షీటర్లకు పోలీస్ అధికారులు సత్ప్రవర్తనతో జీవించాలని హెచ్చరిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100 కు తెలియచేయాలని ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


ఆర్మీ జవాన్ సుబ్బారావు (ఫైల్)


అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

వేంపల్లె : ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్న స్థానిక శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన చల్లా సుబ్బారావు(40) ఆకస్మికంగా మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. చల్లా సుబ్బారావు 18 ఏళ్ల క్రితం ఇండియన్ ఆర్మీకి ఎంపికయ్యారు. ఈ క్రమంలో అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న డ్యూటీలో ఉండగానే ఆకస్మికంగా మృతి చెందారు. మృతదేహాన్ని ఆర్మీ అధికారులు అతని స్వగ్రామం వేంపల్లెకు తీసుకువచ్చి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య రేణుక, పిల్లలు హేమ, జగదీష్, తల్లిదండ్రులు సూర్యనారాయణ, వెంకటమ్మ ఉన్నారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

స్విట్జర్లాండ్ సంస్థలతో 'అన్నమాచార్య' ఒప్పందం

రాజంపేట : స్విట్జర్లాండ్ దేశానికి చెందిన రెండు సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో–చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. తాము స్విట్జర్లాండ్ దేశంలో ప్రముఖ జ్యూరిచ్ యూనివర్సిటీతోపాటు మరో సంస్థతో ఎంవోయూ చేసుకున్నామని వెల్లడించారు. క్యూఎస్‌లో ప్రతిష్ఠాత్మక రంగంలో 90వ స్థానంలో జ్యూరిజ్ యూనివర్సిటీ ఉందన్నారు. సాంకేతిక ప్రగతికి బలమైన భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు యూనివర్సిటీల మధ్య విద్యార్థులకు మార్పిడి సదుపాయం కలుగుతుందన్నారు. వారికి విభిన్న, సాంస్కృతిక, విద్యా అనుభవాలను అందిస్తుందన్నారు. పరిశోధనల మార్పిడి ద్వారా ఇరు విద్యాసంస్థల ప్రగతికి తోడ్పాటు అవుతుందన్నారు. స్విట్జర్లాండ్ యూనివర్సిటీ ఒప్పందంపై ఏయూ చాన్సలర్ చొప్పాగంగిరెడ్డి, ఏఐటీఎస్ అధినేత చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ హర్షం వ్యక్తంచేశారు.

హార్సిలీహిల్స్‌పై గ్రామసింహాల స్వైర విహారం

- మృతి చెందిన దుప్పి
- వన్యప్రాణులకు ముప్పు
- పర్యాటకులకు ఇక్కట్లు


హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

బి.కొత్తకోట : చల్లటి వాతావరణం, స్వచ్ఛమైన గాలికి నిలయమైన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. సముద్ర మట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని కొండపై పదేళ్ల క్రితం వరకు దోమలు, కుక్కలు కనిపించేవి కావు. పెరిగిపోతున్న కాలుష్యం, ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాల పారబోత కారణంగా.. వాటి కోసం కుక్కలు కొండపైకి రావడం మొదలైంది. రోడ్లపై ఇవి సంచరిస్తూ పర్యాటకులను ఇబ్బందులకు గురిచేయడమే కాక అడవిలోని వన్యప్రాణులపైనా దాడులకు పాల్పడి ప్రాణాలు తీస్తున్నాయి. వ్యర్థాలను తరలించి నిల్వ చేసేందుకు కొండ కింద డంపింగ్ యార్డును గతంలో అధికారులు ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని కొండ కింద నుంచి కుక్కలు కొండపైకి చేరుకుని ఇక్కడే ఉండిపోయాయి. నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే సందర్శకులు, ప్రముఖులకు అసహనం కలిగిస్తున్నాయి. గాలిబండ, వ్యూపాయింట్ల వద్ద సందర్శకులు వెంట తెచ్చుకుని తినే ఆహారం కోసం వారి వద్ద ఎగబడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అటవీప్రాంగణం, రెవెన్యూ అతిథిగృహం, జిడ్డు సర్కిల్ ప్రాంతాల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. బైక్‌లపై వెళ్లే వారి వెంటపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా అడవిలోని వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉంది. శనివారం దుప్పిని వెంటాడి దాడిచేసి కొరికి చంపాయి.

ఇదేకాక మరికొన్ని వన్యప్రాణులు వీటి బారిన పడి మృత్యువాత పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ఘాట్‌రోడ్డులో యథేచ్ఛగా సంచరిస్తూ రోడ్డును దాటుతున్న వన్యప్రాణాలపై దాడి చేస్తున్నాయి. గంగోత్రి వద్ద, రోడ్డు పక్కన నీటితొట్టెలున్న చోట నీళ్లు తాగేందుకు వచ్చే వన్యప్రాణులపై దాడి చేస్తున్నాయి. దీని కారణంగానే నిత్యం ఘాట్‌రోడ్డుపై కనిపించే జింకలు, కుందేళ్లు, దుప్పులు, కణితలు తదితర వన్యప్రాణులు కనిపించడం లేదని సందర్శకులు చెబుతున్నారు. కాగా శనివారం మృతి చెందిన దుప్పి గురించి సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి డీఆర్‌ఓ మదన్‌మోహన్ స్పందించారు. మృతి చెందిన దుప్పిని సిబ్బంది పరిశీలించారు. కళేబరాన్ని అడవిలోనే పూడ్చి పెట్టారు. హార్సిలీహిల్స్‌పైన, ఘాట్ రోడ్డుపై కుక్కల బెడద లేకుండా చేసేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.